
# ఇన్‌కమింగూ అవుట్ గోయింగూ!

**- జగన్నాథ్ శివల**

ఉగాది పోటీలో ఎంపికైన కథ



**పరబ్రహ్మం రైలు దిగాడు. తనని ఇంటికి తీసుకెళ్ళడానికి కొడుకు శ్రీనివాసు వస్తాడనుకుని అటు ఇటు చూసేడు. ప్లాట్‌ఫాం అంతా కలయచూస్తూ కాస్సేపు గడిపాడు. శ్రీనివాసు రాలేదని బాధపడుతూ రిక్షా మాట్లాడుకుని ఎక్కాడు.**

ఊరు చాలా చాలా మారింది. పదేళ్ళ కిందట మనవడి బాలసారెకి పరబ్రహ్మం ఆ వూరు వచ్చేడు. అతను ఉంటున్నది పల్లెటూరు. పొలం, ఇల్లు తాతలనాటి ఆస్తులు. కొడుక్కి పెళ్ళి అయ్యేదాకా తండ్రిని తన దగ్గరికి రమ్మని పదే పదే పిలిచేవాడు. పట్నంలో బ్యాంకులో వుద్యోగం చేస్తున్నాడు శ్రీనివాసు. బాల్యం పల్లెలో గడిచింది. పదవ క్లాసు పాసయ్యేక పట్నంలో వున్న దూరపు బంధువుల ఇంట్లో వుండి డిగ్రీ పూర్తిచేసాడు. లక్కీగా వెంటనే వుద్యోగం వచ్చింది. ఇదంతా బాగానే వుంది. కొడుకు తెలివితేటలు, సామర్థ్యం పరబ్రహ్మంకెంతో ఆనందం కలిగించేయి. శ్రీనివాసు పెళ్ళి విషయంలో తండ్రి తెచ్చిన పిల్లనే ఒప్పుకున్నాడు.

ఇప్పటిదాకా తనకి అనుకూలంగా వున్నాడు శ్రీనివాసు. పెళ్ళయి ఒక ఏడాది అయింది. కొడుకులో మార్పు వచ్చింది. కోడలు దేవకి ఏం చెబితే అది చేస్తాడు కొడుకు. "మీ నాన్నని అక్కడే వుండనీండి. స్వంత ఇల్లుంది కదా? అద్దె ఇవ్వక్కర్లేదు. భూమి మీద పంట డబ్బు వస్తుంది. మనం రూపాయి ఇవ్వక్కర్లేదు" అని చెప్పింది.

"అది కాదు. మా నాన్న తన వంట తనే ఎన్నాళ్ళు వండుకుంటాడు? మా అమ్మ చనిపోయి పదహారేళ్ళు అయింది. ఇంతకాలంగా నాన్నే వండుకుంటున్నాడు. ఇంకా ఆయన్ని కష్టబెట్టకూడదు" అన్నాడు శ్రీనివాసు.

దేవకి ఎంత మాత్రం ఒప్పుకోలేదు.

పరబ్రహ్మం ఉత్తరం రాస్తే సమాధానం వచ్చేది కాదు. తండ్రి హృదయం పరితపించేది. పదకొండు ఉత్తరాలు రాశాడు. ఒక పోస్టుకార్డు జవాబుగా వచ్చింది. కార్డు మీద "మీరు ఫోను కొనుక్కోండి మావగారు. ఫోనుంటే ఉత్తరాల బాధ వుండదు. నాకు, మీ అబ్బాయికీ, మీ మనవడికీ ఉత్తరం రాయడానికి తీరిక ఉండదు. ఉత్తరం రాయాలంటే మాకు పది నిమిషాలేనా పడ్తుంది. పది నిమిషాల్లో పది పనులు ఆగిపోతాయి మాకు." అని దేవకి రాస్తే, వెంటనే పరబ్రహ్మం లేండ్ ఫోన్ కొని పెట్టించుకున్నాడు.

తన ఇంట్లో ఒక లేండ్ ఫోను, రెండు సెల్‌ఫోన్లు ఉన్నాయని శ్రీనివాస్ చెబితే పరబ్రహ్మం ఆశ్చర్యపోయి "అదేవిట్రా అబ్బాయ్! ఒక ఇంట్లో మూడు ఫోన్లు ఎందుకురా?" అనడిగాడు.

"నీకు తెలీదు నాన్నా. అదంతే. నాకు ఒక సెల్ ఉంది. దేవకికి మరో సెల్‌ఫోను. ఇవి కాకుండా మా హాలులో లేండ్ ఫోను అదివరకునించే ఉంది. మాకు చాలా కాల్స్ వస్తుంటాయ్. మాట్లాడక పోతే బావుండదు" అని చెప్పాడు.

ఈమధ్యన పరబ్రహ్మానికి వండుకోవడానికి ఇబ్బందిగా ఉంది. వయసెక్కువవుతోంది. ఆయన ఆ పల్లెలోనే ఎలిమెంటరీ బళ్ళో నాలుగు, అయిదు క్లాసులకి తెలుగు, లెక్కలు చెబుతూ ముప్పయ్యేళ్ళ సర్వీసూ అక్కడే పూర్తిచేశాడు. ఇప్పుడు డెబ్బయ్యేళ్ళు వచ్చేశాయి. పొలం, ఇల్లు అమ్మెయ్యాలని నిశ్చయించుకున్నాడు. ఉత్తరాలు, ఫోన్ల ద్వారా ఆ కబురు చెప్పడానికి మనస్కరించక, బయలుదేరి వచ్చేడు కొడుకు దగ్గరికి.

రిక్షా దిగి ఇంట్లోకి వచ్చిన పరబ్రహ్మంకి మనవడు ఎదురయ్యేడు. పదేళ్ళవాడయ్యేడు వాడు! ఎప్పుడో మనవడి బాలసారెకి వచ్చీ పసివాడిని తను చూసేడంతే!

"యాహూ" అని అరిచేడు మనవడు గోపీ. శ్రీనివాసు మెళ్ళో జందెం వేసుకున్నట్టు సెల్‌ఫోను తాడుతో వేళ్ళాడుతోంది! "వీడేనా నీ కొడుకు?" అని పలకరించేడు.

"డాట్‌కామ్. డబ్లియూడబ్లియూడబ్లియూ.యాహూశ్రీనివాస్" అని అరిచేడు గోపీ. "వాడలాగే అరుస్తాడు నాన్న. భయపడకు," చెప్పాడు శ్రీనివాస్.

పొలం, ఇల్లు అమ్మేసీ కొడుకు దగ్గరికి వచ్చేస్తానని చెప్పాడు పరబ్రహ్మం.

"ఆ మాట నాకు చెప్పడం ఎందుకు నాన్నా? అమ్మేసి వచ్చెయ్యవల్సింది నువ్వు. వేగిరం అమ్మెయ్యి" అనేసి మెళ్ళో సెల్లు తీసి మాట్లాడసాగాడు.

శ్రీనివాస్ వాళ్ళింట్లో వ్యవహారం చిత్రంగా అనిపించింది. శ్రీనివాస్ మెళ్ళో వేళ్ళాడుతున్న సెల్లుతో వరస వరసగా ఎవరెవర్తోనో అలా మాట్లాడుతూనే వున్నాడు. ఆగితే సెల్లు మోగుతోంది!!

కోడలు వంట గదిలో వుంది. ఆమె మెళ్ళో సెల్ తాడుతో పుస్తెల తాడులా వేళ్ళాడుతోంది! పరబ్రహ్మం విస్తుపోయేడు. గ్యాసు స్టవ్వు దగ్గర నిలబడి దేవకి స్నేహితురాలితో సెల్‌లో తెగ మాట్లాడేస్తూ నవ్వుతూ "అయ్యో... అలాగా?... బావుంది... అంత సీను ఏం లేదులే" అంటోంది! మామగారిని చూసింది, నవ్వింది. నవ్వింది కదా అని ప్రేమగా ఆప్యాయంగా తను వచ్చిన పని చెప్పాడు.

"నా మొహం" అంది. హడలి పోయేడు. "అంత సీనేం లేదు" అంది. ఓహో స్నేహితురాలితో మాటలా? అని సర్దుకున్నాడు పరబ్రహ్మాం.

పొయ్యి మీద మంట హైలో వుంది!! మూకుట్లో కూర నల్లగా మాడిపోయి బొగ్గుల్లా తయారైంది!! అనుమానం వచ్చీ ప్రెషరు కుక్కరు దించి చూసేడు పరబ్రహ్మాం. నీళ్ళు తక్కువగా పోసినట్టుంది. బియ్యం అన్నం అవలేదు! వేడెక్కాయంతే! కోడలి వంట ఇలా తగలడ్తుందన్న మాట!!

"మీరు భోజనం ఎలాచేస్తున్నార్రా?" అని కొడుకుని అడిగాడు.

చెవి దగ్గర సెల్లు తియ్యలేదు శ్రీనివాసు. తండ్రిని కళ్ళతో చూశాడంతే. చెవులు నోరు మనసు సెల్లుకే అంకితం అయివున్నాయ్!

మనవడికోసం చూస్తే, వాడు వాడికోసం కేటాయించిన గదిలో కంప్యూటరు పట్టుకుని కూచున్నాడు.

"ఇంత చిన్నవాడికి కంప్యూటరు ఏవిట్రా?" కొడుకునడిగాడు.

"నీకు తెలీదు నాన్నా. నీ మనవడింకా చిన్నవాడేవిటి? పదేళ్ళవాడు. అయిదేళ్ళ పిల్లలే కంప్యూటరు స్కూళ్ళలో నేర్చుకొంటున్నారు. చదువులో అదో భాగంలెద్దరు. ఇంటర్నెట్టులో నీ మనవడు భోజనం కూడా చేసేస్తాడు" అని చెబితే, మరోమారు హడలిపోయేడు పరబ్రహ్మాం.

"ఇంటర్నెట్టులో భోంచెయ్యడం ఏవిట్రా?" భయంగా అడిగాడు.

"మరేం చేస్తాడు? వాళ్ళమ్మ వాడికి కావల్సినవి వండదు. స్వీటు షుగరొస్తుందంటుంది. కారం తిండి అల్సరొస్తుందంటుంది. మసాలా బ్లడ్ ప్రెషరంటుంది. గోపీగాడు వాడికి తినాలనిపించినవి కాయితం మీద రాస్తాడు. ఇంటర్నెట్టులో ఆ కాయితం పెడ్తాడు.

నానా పాట్లూ పడతాడు! ఇంటర్నెట్టులో స్క్రీన్ మీద ఆహార పదార్థాలు రకరకాల వంటకాలు కనబడితే పెద్ద కేకలేస్తాడు ఆనందంతో. అవి తీనేసినట్టు ఫీలయిపోతుంటాడు! పాపం! వెర్రివెధవ!"

"నీ పెళ్ళాం ఆ సెల్లుతో మునిగి తేల్తోందిరా! వంట పట్టించుకోడంలేదురా! అన్నం వుడకలేదు. కూర బొగ్గయిందిరా! ఇలా అయితే మీరెలా తిని ఛస్తున్నార్రా?"

"నేను దాని వంట తినలేను నాన్నా. మా ఆఫీసుకి వేగిరం పోతాను. అక్కడే టిఫిను చేస్తాను. మా కేంటీన్లో. అక్కడే భోజనం చేసేస్తాను."

"మరయితే గోపీ ఏం తింటున్నాడురా?"

"పాపం గోపీ పిచ్చి వెధవ, తిండికి మొహం వాచిపోయి వున్నాడు." అంటుంటే శ్రీనివాసు మెడలో జందెం సెల్ మళ్ళామోగింది!! ఒళ్ళు మండిపోయింది పరబ్రహ్మాంకి. ఒక మాట తనని చెప్పనివ్వకుండా! ఒక మాట వాళ్ళు వినకుండా, ఏవిటి ఈ సెల్లులు?! ఈ ఇంటర్నెట్టులూ?!!

గోపీని పట్టుకున్నాడు ఎలాగో, "మరయితే మీ అమ్మ వంట ఆ విధంగా తగలబడితే నువ్వు ఎలా తింటావ్‌రా గోపీ?"

"నాన్న డబ్బులిస్తాడు నాకు రోజూ. హోటలు దగ్గరే ఉంది తాతయ్యా! నువ్వు కూడారా! మనం హోటల్లో టిఫిను తిందాం. టిఫిను అయితేనేం, భోజనం అయితేనేం? ఏదో ఒకటి! తిండానికి"

"ఇట్లా ఎన్నాళ్ళు హోటల్లో తింటార్రా?" అని వాపోయాడు పరబ్రహ్మాం.

దేవకి విన్నది వాళ్ల మాటలు. "నేను ప్రతీరోజు ఏమీ వంట తగలబెట్టడం లేదండీ. ఏదో ఒక పూట బాగానే చేస్తున్నాను కదా? మరీ చిత్రాలు తండ్రీ,కొడుకును! వండినప్పుడు వండడం లేదా? తిన్నప్పుడు తినడం లేదా ఏమిటి?" ఇల్లు ఎగిరి పోయేట్టు కేకలేసింది కోపంతో. మరోమారు హడలి పోయేడు పరబ్రహ్మాం.

"నేను పొలం, ఇల్లు అమ్మేస్తానమ్మాయి! మీతో చెబుదామని వచ్చాను" అన్నాడు. వేగం అమ్మెయ్యమంటుంది అనుకున్నాడు.



"ఒద్దొద్దు. పొలం అమ్మకండి, ఇల్లు అమ్మకండి." అంది గాభరా పడుతూ.

మరోమారు హడలిపోయి, "నేనింక వంట చేస్కోలేను. డెబ్బయ్యేళ్ళవాణ్ణి... ఓపిక లేదు. మీ దగ్గరే ఉంటాను."

"అది కాదు. ఇక్కడ ఇల్లు సరిపోదు. నాకు మీ అబ్బాయికీ ఒక గది. మీ మనవడిది ఒక గది. మీరెక్కడ పడుకుంటారు?"

"హాలు ఉంది కదా?"

"హాలుకి ఎటాచెడు బాత్రూంలేదు కదా?"

"మనవడి గదిలో రాత్రి పడుకుంటాలే".

"వాడికి డిస్టర్బెన్సు. ఇంటర్నెట్టు కంప్యూటరు సిస్టమ్‌కి మీరుంటే డిస్టర్బెన్సు అనీ... ఏమో? అయినా మీరు పొలం అమ్మెయ్యడం ఎందుకు? దానిమీద పంట డబ్బు ప్రతీ ఏడూ చేతికింత ఒస్తోంటే?"

పరబ్రహ్మాంకి ఒళ్ళు భగభగ మండిపోయింది దోభీ వచ్చేడు. మూట విప్పి పద్దు చూడమంటుంటే వాడి జేబులో సెల్ మోగింది. పద్దు చూడడానికి కోడలు వచ్చింది. మెళ్ళో సెల్ మోగింది. బట్టలు అలాగే పడీ వున్నాయి!! లాండ్రీవాడు వాడి సెల్‌తో, కోడలు ఆమె సెల్‌తో మునిగితేల్తున్నారు! పరబ్రహ్మాం వీధిలోకెళ్ళినించున్నాడు సాయంత్రం.

ఎదురింటి దగ్గర పాలవాడు గేదెని తెచ్చి పాలు పితుకుతుంటే వాడి మెడలో సెల్ మోగింది. పాలు తియ్యడం ఆపి సెల్లు పట్టుకున్నాడు. గేదెకి ఒళ్ళు మండి ఒక్క తాపు తన్నింది వాడిని!! అలా నడిచేడు రోడ్డుమీద పరబ్రహ్మాం. గెడ్డం పెరిగినట్టనిపించీ సెలూన్‌లోకెళ్ళాడు. క్షురకుడి మెళ్ళో సెల్ మోగింది!! ఒకవేపు గెడ్డం గీసి ఆపీ, సెల్లు పట్టుకున్నాడు. "సార్ ఛానల్‌కి నేను రిజిస్ట్రేషను చేస్కున్నాను. రెండు ప్రశ్నలకి సరదాగా నవ్వుగా జవాబులు చెబితే బహుమతిస్తార్ట. శ్రాద్ధం ఎక్కడ పెడతారు?" అనడిగాడు.

"చెట్టు కింద"

"ఫిండాకూడు ఎవరికి పెడతారు?"

"పిల్లులకి" అని చెప్పాడు పరబ్రహ్మాం.

తన పల్లెటూరుకి ప్రయాణమయ్యేడు పరబ్రహ్మాం.

"మీ అబ్బాయి రాత్రి నన్ను తిడుతున్నాడండీ మావగారూ! డబ్బు పట్టుకునీ వేగిరం మిమ్మల్ని వచ్చెయ్యమని చెప్పమన్నారాయన" అంది దేవకి

"ఒద్దమ్మా ఒద్దు. నా బతుకేదో అక్కడే నేను బతుకుతాన్లే. మీ బతుకు మీరు బతకండి! మీ కాలం విలువయింది. రెండుపూటలా సుబ్బరంగా ఇంత తిండి కడుపారా తినలేని బిజీ బిజీ మనుషులు మీరు!! ఎలాగా డెబ్బయ్యేళ్ళు వచ్చేసేయి నాకు. ఉన్న నాల్రోజులు నా ఇంట్లో నేను ఎవర్నో బ్రతిమాలుకుని వండించుకు తిని వుంటాను.నావల్ల నీకు నీ కొడుక్కీ డిస్టబెన్సులు ఒద్దమ్మా! ఒకవేళ నేను ఛస్తే నా ఆత్మ మీ ఇంటర్నెట్టులో కనబడి చెబుతుందిలే చావు కబురు! నవ నాగరికత ఇన్‌కమింగు అయిపోయి నన్నిక్కడ ఉండనివ్వడం లేదు. నాలో ఉన్న మనశ్శాంతి అవుట్ గోయింగు అయిపోతుంది నేనిక్కడ వుంటే... ..." అని చెప్పి రైలు ఎక్కేడు పరబ్రహ్మాం.

★

## రమ్ హవా!

మందు లేని విందు మహా చప్పగాయె.. నాన్‌వెజ్జు లేక నాలుక పేదదాయె అన్నట్టు ఇప్పుడు కుర్రాళ్లకు వైట్ రమ్ము లేకపోతే నిద్దురే రాదు. లీటర్లకొద్దీ కోక్‌లు తాగినట్టే ఇప్పుడు కరేబియన్ దీవుల్లో వైట్ రమ్ముపై కుర్రాళ్లు మక్కువ చూపుతున్నారు. కరేబియన్ వైట్ రమ్ము ఇప్పుడు మెక్సికో తరువాత రెండో స్థానాన్ని సంపాదించింది. వెస్టిండీస్‌లో ప్రధాన ఆదాయ వనరు టూరిజమే అయినప్పటికీ మద్యపానమనేది కూడా ఇప్పుడు పెద్ద ఆదాయంగా అయింది. మామూలుగా చెరకునుంచి తీసిన మొలాసిస్ నుంచి దీన్ని తయారుచేస్తారు. అయితే కరేబియన్ దీవుల్లో చెరకు పండదు. అయినా సరే ప్రత్యమ్నాయాన్ని చూసుకుని సరుకును మాత్రం ఉత్పత్తి చేస్తున్నారు. కరేబియన్ దీవుల్లో డెమెరేరా అనేది ఓ పెద్ద జీవ నది. దీన్ని పరీవాహకంలో ఎక్కువగా వైట్‌రమ్‌ను తయారుచేస్తున్నారు అక్కడివాళ్లు. విశేషమేమంటే రమ్‌కు కూడా డెమెరేరా అనే బ్రాండ్ నేమ్ కూడా తగిలించారు. బాంక్స్, ఇ ఐ డొరాడో, లెమన్ హార్ట్ అనే బ్రాండ్‌లతో రమ్‌ను తయారుచేస్తున్నారు. కరేబియన్ దీవుల్లో మంచి క్వాలిటీ రమ్ చేస్తున్నది మాత్రం జమైకాలోనే. ఆ తరువాతి స్థానాలు గయానా, బార్బడోస్ రాష్ట్రాలకు దక్కుతుంది. 1703వ సంవత్సరంలోంచే దీన్ని తయారు చేస్తున్నారుట. ఈ దీవుల్లో ప్రస్తుతానికి పాతికేళ్ల కుర్రాళ్లు కనీసం నలభై శాతం మంది సేవిస్తున్నట్టు అంచనా. బెల్ల డాన్సుల్లోనూ, సాంబ నృత్యాల్లోనూ ఎక్కడ చూసినా దీని హవానే కొనసాగుతోంది. ఇక్కడి నుంచి కొన్ని దేశాలకు ఎగుమతి కూడా అవుతోంది. ఇంతకీ కరేబియన్ దీవుల్లో రమ్‌దే హవా.!

-తనిష్క